నగరంలో జోరు వర్షం



తమ సరుకులు వర్షంలో తడవకుండా గొడుగులతో భద్రపరుస్తూ..



వర్షంలో తడుస్తూ వెళ్తున్న విద్యార్థినులు

నెల్లూరు నగరంలో విడతల వారీగా శనివారం మోస్తరు వర్షాలు కురిశాయి. జనార్ధన్‌రెడ్డికాలనీ, ఆత్మకూరు బస్టాండ్, ట్రంకురోడ్డు, వేదాయపాళెం, హరనాథపురం, చంద్రబాబునగర్, బుజబుజనెల్లూరు, ఆర్టీసీ కాలనీ తదితర అన్ని ప్రాంతాల్లో ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు చేరిపోయింది. పొగతోట, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జి, మాగుంట అండర్‌బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరింది. నగరంలోని పలు వీధుల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. హరనాథపురం సెంటర్ నుంచి ముత్తుకూరు వెళ్లే మార్గంలో కిలోమీటర్‌కు పైగా రోడ్లు గోతులు పడ్డాయి. అపోలో ఆస్పత్రి ముందు భాగం పూర్తిస్థాయిలో తెబ్బతింది. అలాగే ముత్తుకూరు రోడ్డు నుంచి ఎల్ఐసీ కాలనీ మీదుగా బైపాస్ రోడ్డు వరకు ఉన్న బీటీ రోడ్లు పలుచోట్ల మోకాలి లోతుకు పైగా గోతులతో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగుతోంది. పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరం చిత్తడి, చిత్తడిగా మారింది.

- నెల్లూరు(అర్బన్), సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు



జోరు వర్షంలో బస్సు కోసం పరుగు తీస్తున్న యువకులు



తీవ్రంగా దెబ్బతిన్న అపోలో ఆస్పత్రి రోడ్డు



వీఆర్సీ సెంటర్‌లో కురుస్తున్న జోరు వర్షం

క్లుప్తంగా

జిల్లాలో భారీ వర్షాలు

- మూడ్రోజుల్లో సరాసరి 73.6 మి.మీ వర్షపాతం నమోదు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం భారీ వర్షాలు కురిశాయి. మరికొన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంతో పాటు కొండాపురం, వెంకటాచలం, తోటపల్లిగూడూరు, కావలి, రాపూరు, వింజమూరు, ఇందుకూరుపేట, వలేటివారిపాళెం, ఉలవపాడు, గుడ్లూరు, మర్రిపాడు, ఆత్మకూరు, సంగం, బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవలూరు, దగదర్తి, ముత్తుకూరు, పొదలకూరు, మనుబోలు ఇలా దాదాపు అన్ని మండలాల్లో వర్షాలు నమోదయ్యాయి. ఈనెల 16న జిల్లాలో సరాసరి వర్షం 22.0 మిల్లీమీటర్లు, 17న 45.4 మి.మీ, 18వ తేదీ ఉదయం నాటికి 6.2 మి.మీ వర్షం కురిసింది. మూడురోజుల్లోనే 73.6 మి.మీ వర్షం పడింది. పలుచోట్ల వాగులు, వంకల్లోకి వర్షపు నీరు చేరింది. ఈశాన్య రుతుపవనాల ఆగమనంతో కురుస్తున్న వర్షాల వల్ల పలుచోట్ల రోడ్లు ఛిద్రమయ్యాయి. పలు గ్రామీణ ప్రాంతాలు సైతం బురదమయంగా మారాయి.

భక్తిశ్రద్ధలతో త్రయోదశి



చిన్నవెండినంది ఉత్సవంలో స్వామివార్లు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో త్రయోదశి సందర్భంగా శనివారం నందీశ్వరునికి, స్వామివార్లకు అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం చిన్న వెండినంది ఉత్సవంలో స్వామివారు సర్వాలంకార శోభితంగా కొలువై భక్తులను అనుగ్రహించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా శ్రావణ్ కుమార్- లక్ష్మీశ్రావణి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పాల్గొని, పర్యవేక్షించారు.

పూజా సామగ్రి కిట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 300 ఆలయాలకు 'ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి' ఆధ్వర్యంలో ధూపదీప నైవేద్య పూజా సామగ్రి కిట్లను అందజేస్తున్నట్లు సంస్థ కన్వీనర్ ధన్వి శ్రీనివాస్ తెలిపారు. మైపాడురోడ్డు వైకుంఠపురం కాశీనాయన ఆశ్రమంలో పూజా సామగ్రి కిట్‌ల పంపిణీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్న సంకల్పంతో పసుపు, కుంకుమ, కర్పూరం, గంధం, విభూతి, అగరబత్తీలు, 360 వత్తులు, కలకండ, నూనె, ఆధ్యాత్మిక పుస్తక ప్రతులు తదితరాలను అందజేస్తున్నామన్నారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఎయిడ్ ఇండియా ఫౌండేషన్, విజయవాడ గన్నవరం భువనేశ్వరి పీఠం అధిపతి కమలానంద భారతి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు తదితరుల సౌజన్యంతో అందజేస్తున్నామన్నారు. సంస్థ సభ్యులు నెల్లూరు వెంకటరత్నం, మేకల నరసింహారావు, దరిశిగుంట వెంకటేష్, సుబ్రహ్మణ్యం, వైష్ణవి, జలజ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ తనిఖీలు



యాప్ ద్వారా బాటిల్ స్కానింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని పలు బార్లు, మద్యం దుకాణాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ ఎం.శంకరయ్య, డీపీఈఓ ఎ.శ్రీనివాసులునాయుడు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. లైసెన్సీలు ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్ ద్వారా మద్యం బాటిల్స్‌ను స్కాన్ చేసి అమ్మకాలు నిర్వహిస్తున్నారా? యాప్‌లో రికార్డులు సక్రమంగా నమోదవుతున్నాయా వంటి అంశాలను పరిశీలించారు. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులకు యాప్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా వినియోగదారులు తాము కొనుగోలు చేసిన మద్యం బాటిల్స్ అసలైనదా? నకిలీదా అని తక్షణమే తెలుసుకోవచ్చన్నారు. నకిలీ మద్యం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విక్రయాలు, బెల్టుషాపులపై సమాచారం ఉంటే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణంపై గ్రామసభ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు సంబంధించి దేవస్థాన ప్రాంగణంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయశాఖ తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్‌ఆజాద్ హాజరై, మాట్లాడారు. దేవస్థానం పునర్నిర్మాణ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ నమూనాను భక్తులకు వివరించారు. భక్తుల నుంచి పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తల



మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, జిల్లా దేవదాయ శాఖ అధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఈఓ జంజం శ్రీనివాసరావు, నారాయణ విద్యాసంస్థల మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, స్థపతి పి.పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



ప్రభుత్వ ఆస్పత్రిలో..



స్పాస్టిక్ సెంటర్‌లో..

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి కులమతాలకు అతీతంగా సంతోషంగా జరుపుకునే అందరి పండుగ అన్నారు. అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, డాక్టర్ వసంత, పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పాస్టిక్ సెంటర్‌లో..

నెల్లూరు(అర్బన్): స్థానిక మద్రాస్ బస్టాండ్ పక్కనే ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ ఎంఎస్సార్ స్పాస్టిక్(మానసిక దివ్యాంగులు) సెంటర్‌లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ దీపావళి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. దీపాలు వెలిగించి సంబరాలు నిర్వహించారు.

రొమ్ము కేన్సర్‌పై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్



హాజరైన మహిళలు

నెల్లూరు(అర్బన్): భారతదేశంలో స్త్రీల్లో ప్రథమ స్థానంలో ఉన్న రొమ్ము కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. బ్రెస్ట్ కేన్సర్ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పొదలకూరు రోడ్డులోని కేన్సర్ ఆస్పత్రిలో అవగాహనా సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 45 ఏళ్లు దాటిన స్త్రీలలో రొమ్ము కేన్సర్ కేసులు వచ్చేవన్నారు. ఇప్పుడు చిన్న వయస్సులోనే రొమ్ము కేన్సర్‌లు వస్తున్నాయన్నారు. అంతేకాకుండా మగవారిలో సైతం రొమ్ము కేన్సర్‌లు వస్తున్నాయన్నారు. ఊబకాయం, జంక్‌ఫుడ్, వ్యాయామం లేకపోవడం, కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం తదితర వాటివల్ల ఈ రకం జబ్బులు వస్తున్నాయన్నారు. అందువల్ల 20 ఏళ్లు వచ్చిన స్త్రీలు స్వీయ పరీక్షలు చేసుకోవాలన్నారు. తేడాలు గమనిస్తే దగ్గర్లోని వైద్యుని వద్దకు వెళ్లి సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం స్వీయ పరీక్షలు, ముందస్తు జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మౌనికారెడ్డి, రేడియాలజిస్ట్ డాక్టర్ హరితారాణి, పెథాలజిస్ట్ డాక్టర్ నందిత తదితరులు పాల్గొన్నారు.

రంగడి కల్యాణం నేడు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం రంగడి కల్యాణ మహోత్సవం జరుగనుందని నిర్వాహకులు ఖండవిల్లి రాధాకృష్ణ శనివారం తెలిపారు. 'సనాతన ధర్మ వారధి' ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగనుందన్నారు. వ్యవస్థాపకుడు గురుదేవులు, ధర్మాచార్య కల్వకొలను శ్రీరామచంద్రమూర్తిచే 'నిత్యపూజ' అంశంపై అనుగ్రహభాషణం జరుగుతుందన్నారు.

ఘనంగా వార్షికోత్సవ ఆరాధన



కేక్ కట్ చేస్తున్న సంఘ కాపరి, పెద్దలు

నెల్లూరు(బృందావనం): బాప్టిస్టు చర్చి డొనీహాల్ ఆలయ నూతన భవన 13వ వార్షికోత్సవ ఆరాధనను శనివారం ఘనంగా నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న ఆ చర్చిలో కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ శ్యాంసన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. సండే స్కూల్ చిన్నారులు, యువజన విభాగం సువార్త సేవా బృందం, స్త్రీల సమాజం, గాయక బృందం భక్తిగీతాలను ఆలపించారు. సంఘ పెద్దలు కేక్ కట్ చేసి, పెద్దలను సన్మానించారు. బాప్టిస్టు చర్చి డొనీహాల్ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో సంఘ చైర్మన్ డి.సురేంద్ర, క్వైర్ డైరెక్టర్ విల్లీ శ్యాంసన్, గ్రామీణ సంఘాల పాస్టర్లు, డీకన్‌లు, కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి సంఘీయులు పాల్గొన్నారు.

పెంచలరావుకు నివాళి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీఎన్‌జీజీఓస్ సంఘ జిల్లా అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ మన్నేపల్లి పెంచలరావు మృతికి పలువురు నివాళులర్పించారు. నగరంలోని రామలింగాపురంలో ఉన్న ఇరిగేషన్ సర్కిల్ యూనిట్‌లో ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సంతాపసభను నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు ఎస్.ఆంజనేయవర్మ, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా కోశాధికారి వీఎంవీ ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం వైస్ చైర్ పర్సన్ కె.స్వర్ణలతతో పాటు సభ్యులు మన్నేపల్లి పెంచలరావు సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇరిగేషల్ సర్కిల్ యూనిట్ గౌరవాధ్యక్షుడు పి.రవికుమార్, అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, కార్యదర్శి పి.రామచంద్రయ్య, కోశాధికారి ఎస్.సుబ్బరామయ్య, ఇరిగేషన్ సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహానికి అడ్డంకుల్లేకుండా చర్యలు



డ్రెయిన్ కాలువల్లో అడ్డంకులు తొలగించే ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రధాన కాలువల్లో వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక జీఎన్టీ రోడ్డులో ఆయన శనివారం పర్యటించారు. కాలువల్లో ప్రవాహానికి అడ్డంకిగా వీఆర్సీ కూడలి ప్రాంతం, బ్లూ మూన్ హోటల్, అభిరామ్ హోటల్, గాంధీ బొమ్మ లస్సీ సెంటర్ కూడలి, కొత్త హాల్ ప్రాంతం, కనకమహల్ కూడలి ప్రాంతాల్లో కాలువల అడ్డంకులను కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించి సిబ్బందితో తొలగించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా డ్రెయిన్ కాలువలను ఆక్రమించి ఉన్న నిర్మాణాలను, పూడికతీత పనులకు అడ్డంకిగా నిర్మించిన మెట్లు, ర్యాంపులు తదితరాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ప్రతిఒక్కరి బాధ్యత



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో ఏఎస్పీ సౌజన్య



జెడ్పీ కార్యాలయంలో..

నెల్లూరు(క్రైమ్): చెట్లు గాలిని శుద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని, మొక్కలు నాటడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌లలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శుభ్రమైన గాలి అనే అంశంపై జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి మానవ జీవనానికి పునాది అన్నారు. శ్వాసకోస వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు గాలి కాలుష్యం వల్ల మరింత తీవ్రమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్బీ-2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఆర్ఐలు రాజారావు, పోల్‌రాజు, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

- **నెల్లూరు (పొగతోట) :** స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయభాస్కర్ మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- డీఆర్‌డీఏ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. పీడీ నాగరాజకుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు.
- ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఓఎస్సీ సెంటర్‌లో ఆమె మొక్కలు నాటారు.
- స్థానిక వెటర్నరీ పాలిటెక్నిక్ క్లినిక్‌లో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.సోమయ్య ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ జి.కృష్ణమూర్తి, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ యశోద, డాక్టర్ మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఅవుట్‌లో ప్లాట్ల యజమానులకు హక్కులు కల్పించే ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. అనధికార లేఅవుట్‌లోని ప్లాట్ల యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్రమబద్ధీకరణ పథకం ఎల్‌ఆర్‌ఎస్ 2020ను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

ఈ అవకాశం మరో ఐదు రోజులు మాత్రమే ఉందన్నారు.

రిలీవ్ చేసే వరకు దీక్ష విరమించం



నెల్లూరు (టౌన్): బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేసే వరకు నిరాహార దీక్షను విరమించేది లేదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్ తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులతో కలిసి 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుంటే దీక్షను కొనసాగిస్తామన్నారు. మిగులు ఉపాధ్యాయులు ఉన్నా ఆయా స్కూల్స్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఎందుకు రిలీవ్ చేయడం లేదని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులు నిరాహార దీక్ష చేస్తున్నా రెండు రోజులుగా డీఈఓ కార్యాలయానికి రాకుండా తప్పించుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. జిల్లాలో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వీరితో పాటు క్లస్టర్స్‌లో విధులు లేకుండా ఉపాధ్యాయులు ఉన్నారని, వారిని బదిలీ అయిన స్థానంలోకి పంపడం లేదని మండిపడ్డారు. డీఈఓ, ఎంఈఓలకు కావాల్సిన 20 మంది వరకు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేశారని, దీనిపై ప్రశ్నిస్తే తనకు తెలియదని సమాధానం చెప్పడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలు పోరాటాల్లోనూ ముందుండాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహిళలు శ్రామిక విముక్తి పోరాటాల్లోనూ ముందుండాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాసుందరి అన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో 'మహిళా పోరాటాలు- మహిళల కర్తవ్యాలు' అనే అంశంపై శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న మహిళల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, పెట్టుబడిదారులకు సేవ చేస్తూ మహిళలను బానిసలుగా మారుస్తున్నాయని ఆరోపించారు. స్త్రీ, పురుష సమానత్వం, సమాన పనికి సమాన వేతనం, పనిగంటల పెంపు, రాత్రి సమయాల్లో మహిళలతో పనిచేయించుకోవడం లాంటి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై మహిళలు సంఘటితంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. చరిత్రలో మహిళలు చేసిన పోరాటాల వల్ల విద్యా, ఉద్యోగ, ఆస్తి, రాజకీయ అంశాల్లో హక్కులు చట్టబద్ధం అయ్యాయన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పద్మ, సహాయ కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షులు గంగాభవానీ, పద్మ, విష్ణు, లత, కుసుమ ఈశ్వరి, రోహిణి, సునీత, దుర్గ, మంజుల, వసంత తదితరులు పాల్గొన్నారు.